

టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం టివిఎస్ సంస్థ టివిఎస్ అపాచీ ఆర్టీఆర్ 310 ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించింది. ఈ వాహనం ధర రూ.3లక్షల 5వేలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఎండి టీటీడీ బోర్డు సభ్యులు సుదర్శన్ వేణు వాహనం తాళాలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు. తిరుమల డిఐ జానకిరామ రెడ్డి, సంస్థ ప్రతినిధులు రాజారెడ్డి, భక్తవత్సలం, సిద్ధార్థ్ పాల్గొన్నారు.



కమ్మేస్తున్న కరువు

- కష్టాల ఊబిలో రైతన్నలు
- నిలకడ లేని ధరలు
- పట్టించుకోని ప్రభుత్వం
- అసంపూర్తిగా నివేదికల సమర్పణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
చిత్తూరు జిల్లాను కరువు కమ్మేస్తోంది.. ఈ ఏడాది ప్రధాన పంట అయిన వేరుశనగ కూడా చేతికందేలా లేదు.. పెట్టిన పెట్టుబడి రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలీక రైతులు అల్లాడుతున్నారు.. నిలకడ లేదని టమోటా ధరలు, గిట్టుబాటు ధరలేని మామిడి రైతులు నిలువునా కష్టాల ఊబిలో మునిగిపోతున్నారు... జిల్లాలోని రైతాంగం కరువు కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రైతాంగాన్ని ఆదుకోవడానికి పథకాలు తెచ్చాము.. రైతు భరోసా కేంద్రాలు పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి రైతన్నలు కష్టాలు పట్టడం లేదు... పైగా జిల్లాలోని పలమనేరు, గంగవరం, రొంపిచెర్ల, రామకుప్పం మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి జిల్లాలోని మిగిలిన కరువు మండలాలకు అన్యాయం చేసింది.

చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లోని కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే కరువు ఛాయలు కనిపించాయని, మిగిలిన పంటలు బాగున్నాయంటూ జాబితా సమర్పించడంపై జిల్లాలోని రైతులు సంఘాలు, వామపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతాంగాన్ని అదుకొనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో రబీ, ఖరీఫ్ సాగు అంతంతమాత్రమే.. ఈ ఏడాది ఖరీఫ్ సాగు 50శాతం కంటే తక్కువే పంట చేతికి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కరువు అంచనా వేసిన సాంకేతిక నిపుణులు జిల్లాలోని 27 మండలాల్లో రైతాగం ఎలాంటి ఇబ్బంది లేదంటూ ఇచ్చిన నివేదిక జిల్లా రౌతాంగాన్ని విస్మయానికి గురి చేస్తోంది. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న పరిస్థితులను అధ్యయనం చేసి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

తగ్గిన సాగు విస్తీర్ణం

చిత్తూరు జిల్లా ప్రధానంగా ఖరీఫ్ సాగుపైనే ఆధారపడి ఉంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం అధికం గతేడాది ఖరీఫ్ సాగు 2.39లక్షల ఎకరాల్లో పంట సాగు ఉంటే 1.93.105 ఎకరాలు మాత్రమే పంటసాగు అందింది. ఈ ఏడాది 2.28 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినా 1.01.355 ఎకరాలే పంట సాగు కనిపించింది. ఈ ఖరీఫ్ సగానికి సంగం తగ్గిపోయింది. ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేసిన జూన్, జూలై మాసాల్లో కురిసిన అడపాదడపా వర్షాలతో వేరుశనగ సాగుకు రైతులు ఉపక్రమించలేదు. ఫలితంగా జిల్లాలో వేరుశనగ విస్తీర్ణం తగ్గిపోయింది.

దిగుబడి అంతంతమాత్రమే...

అష్టకష్టాలు పడి వేరుశనగ పంట సాగు చేసినా రైతులకు దిగుబడి అంతంతమాత్రమే రావడంతో పెట్టుబడి సైతం రావడం లేదని వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎకరాలకు 10 నుంచి 15 క్వాంటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా ఎక్కువ మంది వేరుశనగ రైతులకు 2 నుంచి 5 క్వింటాళ్లే చేతికందుతోంది. ఎకరాకు రూ.25వేలు పట్టుబడిపెడితే రూ.5 నుంచి 11వేలు మాత్రమే లాభం వస్తోందంటున్నారు. అధిక వర్షపాతంలో వేరుశనగ ఏపుగా పెరిగి పంట దిగుబడి తగ్గిందా అంటే అదీ లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడా అత్యధిక వర్షపాతం నమోదు కాలేదు. 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయ్యింది. 21 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు అయ్యింది. వర్షభావ పరిస్థితులతో జిల్లాలో 1.27లక్షల ఎకరాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

ఈ పరిస్థితులకు అంచనా వేయకుండా జిల్లాలో కేవవలం నాలుగు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కరువు మండలంగా ప్రకటించిన మండలానికి ఆ మండల పరిధిలో సాగురైతులకు పెట్టుబడి రాయితీ వస్తుంది. పంట రుణాలు రీషెడ్యూల్ అవుతాయి. పంట రుణాలపై వడ్డీ మాఫీ అవుతుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పనులపై 50 పని దినాలు కల్పిస్తారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కరువు మండలాల విషయంలో క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని కరువు మండలాల సంఖ్యను పెంచి రైతాంగాన్ని అదుకోవాల్సిన అవసరముందని వామపక్ష రైతు సంఘాలు, రైతులు కోరుతున్నారు.

రబీ సాగుపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : వర్షాలు మొదలు కావడంతో జిల్లాలో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం మెరుగు భాస్కరయ్య ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సాగులో రైతులు తీసుకోవల్సిన సూచనలు తెలియజేశారు. రబీ కాలంలో నెల్లూరు మషురి (ఎన్ఎల్ఆర్ – 34449), నెల్లూరు దాన్యా రాసి (ఎన్ఎల్ఆర్ 3354), సుగంధి (ఎన్ఎన్ఆర్ 30491), ఎంటియు 1010, 1001,1224, బిపిటి 2846 వంటి రకాలను రైతులు సాగుకు ఎంచుకోవచ్చును. నవంబర్ రెండో పక్షంలో నార్లు పోసుకొని డిసెంబర్ 15లోపు నాట్లు వేసుకోవాలి. ఎకరానికి 25-30 కిలోల విత్తనాన్ని, 4-5 సెంట్లు నారు పెంచితే, నారు ఆరోగ్యంగా ఉంటుంది. వరి విత్తనాలను భావిస్టిన్ మందు ద్రావణంలో (లీటర్ నీటికి 2 గ్రాములు) నానబెట్టి నారు పోస్తే, పైరుకు రోగాల బెడద ఉండదు. నారుమడి నుండి నారు తీసే వారం రోజులు ముందు ఎకరానికి సరిపడా నారుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసి నీరుపెట్టి ఇంకించాలి. దీనివలన పొలంలో నెల వరకు పైరుకు పురుగులు ఆశించవు. 25 రోజుల వయసుగల నారును ప్రధాన పొలంలో నాట్లు వేయడం వలన మంచి ఫలితాలు వస్తాయి.



విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం

నేడు విద్యాసంస్థల బంద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని పలు విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక బైరాగిపట్టేడలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి చలపతి, పిడిఎస్యూ రాష్ట్ర నాయకులు ఆదిలి మాట్లాడుతూ విద్యార్థి, యువజన నాయకులు 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న ఆత్మగౌరవ పోరాటం నవంబర్ 8 నాటికి 1000 రోజులు పూర్తి అయ్యిందన్నారు. ఈసందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలకు పిలుపునిచ్చాయన్నారు. కరోనా కష్టకాలంలో లక్షల మందికి ఆక్సిజన్ అందజేసి ప్రాణాలు నిలబెట్టిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టాలన్న ఆలోచన దుర్మార్గమన్నారు. లాభాలు వస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ఇనుప గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలు అభివద్ధికి నిధులు కేటాయించకుండా నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలు అమలు చేయాలని రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు అన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాల కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. కేసుల భయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారని దుయ్యబట్టారు. తన సొంత జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండుసార్లు శంకుస్థాపన చేసినా ఆచరణలో పురోగతి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతకి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పేజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్‌కు జిల్లాలోని విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, మేధావులు, ప్రజలు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి సహకరించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి, అక్బర్, శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, సుందర్ రాజు, ఓమ్‌రాజ్, హరి కష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.11 కోట్లతో నూతన రోడ్లు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : అభివృద్ధిలో భాగంగా తిరుపతి రాష్ట్రంలో చర్చనీయంగా ఉందని, ముందుకు వెలుతున్నదని టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా నూతనంగా నిర్మించిన రెండు రహదారులను మంగళవారం భూమన ముఖ్యఅతిథిగా పాల్గొనగా నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా భూమన మాట్లాడుతూ అభివద్ధిలో భాగంగా తిరుపతి రాష్ట్రంలో చర్చనీయంగా ఉందని, రహదారుల అభివద్ధితో ప్రజాభివద్ధి జరుగుతున్నదని అందులో భాగంగా నేడు ప్రారంభించిన అనంతాళ్వార్ మార్గానికి వారి వంశస్తులైన రంగాచారి, వారి అన్నదమ్ముల అమత హస్తాలతో ప్రారంభించడం తమ అదష్టమన్నారు. మరో మార్గం తిరుమల వెంకటేశ్వర స్వామికి మాన్యాలు, దానాలు ఇచ్చిన పల్లవుల మహారాణి పరాంతక దేవి పేరు మీదగా నామకరణం చేయడం జరిగిందన్నారు. మహిళలు కూడా ఎంతో ప్రాముఖ్యత ఇచ్చే విధంగా రాణి పరాంతకదేవి, సామవాయి, ఆండాల్ గోదాదేవి పేర్లను నూతన రహదారులకు పెట్టడం జరిగిందని, అదేవిధంగా స్వామి వారికి సేవ చేసిన మహనీయులైనటువంటి తిరుమల నంబి, జగద్గురు రామానుజాచార్యులు, అనంతాళ్వార్, నమ్మాళ్వార్, కులశేఖర ఆల్వార్ మహనీయుల పేర్లు మీదుగా రహదారులకు నామకరణం చేసుకోవడం ఎంతో అదష్టంగా భావిస్తున్నామని భూమన పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈలు మహేష్, సంజీవ్ కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో వైద్యశిబిరాలు : మేయర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:



నగరంలోని అన్ని డివిజన్లలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ప్రతి పేదవానికి మెరుగైన ఆరోగ్యసేవలు అందాలనే లక్ష్యంతో జగనన్న వైద్య రంగంలో విప్లవాతకమైన మార్పు తీసుకువచ్చారని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మేయర్ పాల్గొని వైద్యానికి వచ్చిన పేషెంట్లకు హెల్త్‌చెకప్‌లు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సురక్ష శిబిరాలలో ప్రజలకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. మీడియాతో మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. జగనన్న ఆరోగ్యసురక్ష అనే కార్యక్రమం ద్వారా అందరికీ ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటున్నారని వెల్లడించారు. కార్పొరేటర్ బసవ గీత, ఆరోగ్య అధికారి యువ అన్వేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రవి, వైద్యులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ నాయకుడిలా ఛాలేంజులా..

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానలో పార్వేటి మండపం కూల్చేవేయాలని నిర్ణయం తీసుకోవడంపై టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపామని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూల్చివేయాలని నిర్ణయం తీసుకోవటం వెనుక ఉన్న అందరిపైనా వారం రోజుల్లో కోర్టులో కేసు వేయనున్నామన్నారు. టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు. పార్వేటీ మండపం వద్ద చర్చకు రమ్మంటూ టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు. కాబట్టే వచ్చామని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు. టీటీడీ ఈవో రాజకీయ నాయకుడిలా ఛాలెంజులు విసరటం మంచిది కాదన్నారు.

రైతన్నల ఖాతాల్లో రూ.73.95 కోట్లు జమ

జగనన్నది రైతు సంక్షేమ ప్రభుత్వం: మంత్రి రోజా

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న మంత్రి, కలెక్టర్

2023-24 సంవత్సరంకు గాను వైయస్ఆర్ రైతు భరోసా – పియం కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది రెండో విడత నగదు బదిలీ చేయు కార్యక్రమంను ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా నుండి ప్రారంభించి బటన్ నొక్కి నేరుగా నేడు అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. జిల్లాలో 1,80,654 మంది భూయజమాని రైతులకు, కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ సాగు రైతులకు రూ.73.95కోట్ల లబ్ది చేకూరిందని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల, క్రీడా, సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్కే రోజా తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం వడమాలపేట మండల కేంద్రంలోని ఎస్ఆర్టి ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాట్లు చేయగా మంత్రితో పాటు, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ రైతు బాగుంటే మనం అందరం బాగుంటామని, రైతు చెమటోడ్చి పండిస్తే మనకు ధాన్యాలు అందుతున్నాయని గుర్తు చేశారు. రైతు భరోసా కింద రైతులకు ఏటా రూ. 13,500 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని అన్నారు. తిరుపతి జిల్లాలోనే 2019 నుండి 2022 వరకు 176345 రైతు కుటుంబాలకు 927 కోట్లు వారి ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం లోని రైతులందరికి సాగు ఖర్చు క్రింద పెట్టుబడి సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.13,500ల చొప్పున రైతుల ఖాతాలలో నేరుగా ప్రభుత్వం జమ చేస్తున్నదని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న నిబద్ధత కలిగిన ప్రభుత్వం అని తెలిపారు. అనంతరం మంత్రి, కలెక్టర్ రూ. 73.95 కోట్ల మెగా చెక్కును రైతులకు అందచేశారు. పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ హరి, ఎంపీపీ విజయలక్ష్మి, పిఎసిఎస్ ఛైర్మన్ సుధీర్ రెడ్డి, వడమలపేట సర్పంచ్ మునెమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్, జిల్లా ఎపిఎంఐపి అధికారి సతీష్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథ రామిరెడ్డి, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు 500 ఐరన్ బ్యారికేడ్స్ వితరణ



ట్రాఫిక్ నియంత్రణకు 500 ఐరన్ బ్యారికేడ్స్ వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు దాతలు అందజేసిన 500 ఐరన్ బ్యారికేడ్స్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మంగళవారం అందజేశారు. పోలీస్ పెరేడ్ మైదానంలో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం రోజురోజుకి విస్తరిస్తున్నందని, అదే సమయంలో జనాభా కూడా పెరగడంతో పాటు, వాహనాల వాడకం కూడా పెరగడంతో నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతున్నదని అన్నారు. అంతేకాకుండా తిరుపతి మహాపుణ్య క్షేత్రం అయినందు వలన నిత్యం తిరుమలకు వచ్చే భక్తుల వాహనాల సంఖ్య కూడా రోజురోజుకి పెరుగుతోందని, సరాసరి రోజుకి 20వేల వాహనాల రాకపోకలు నిర్వహణ జరుగుతూ ఉంది. ఇటువంటి పరిస్థితులలో తిరుపతి పట్టణ ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ చాలా కష్టతరంగా మారుతున్నదన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా పోలీస్‌శాఖ, మున్సిపాలిటి అండ్ జాతీయ రహదారుల అధికారులతో కలిసి తిరుపతిలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, బ్యారికేడ్స్‌ను, ఇతర వ్యవస్థలను మెరుగుపరుస్తూ, వారితో సమన్వయం చేసుకుంటూ అన్నీరకాల సదుపాయాల ఏర్పాటుతో శు లభతరంగా ట్రాఫిక్ ప్రవాహం జరిగేలా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు, కులశేఖర్, డిఎస్పిలు సురేంద్ర రెడ్డి, యశ్వత్, చంద్రశేఖర్, చలపతి, కంట్రోల్ రూమ్ ఎస్ఐ సుబ్బా రాయుడు, యాక్ట్ ఫైబర్ నెట్, డిజిటల్ సర్వీసెస్ సంస్థ అడ్వటైస్మెంట్ టీం లీడర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లోని సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ప్రిన్సిపల్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భగత్ రవి, ఉపాధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ హాస్టల్‌లో మెస్, మెయింటెనెన్స్ పేరుతో రూ.2500ల వరకు వసూళ్లు చేస్తూ విద్యార్థులకు మాత్రం అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. హాస్టల్‌లో కడుపు నిండి తినలేక అర్థాకలితో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యుత్ సమస్యల వలన రాత్రి సమయంలో లైట్లు, ఫ్యాన్లు లేక సరిగా చదువుకోలేక అవస్థలు పడుతున్నారని ప్రిన్సిపల్ దృష్టికి తెచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సమస్యలు తన దష్టికి రాలేదని వెంటనే ఈ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తేజ, పవన్, పురుషోత్తం, చక్రి పాల్గొన్నారు.

17న పెద్దశేష వాహనంపై శ్రీ మలయప్ప దర్శనం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో నవంబరు 17వ తేదీన నాగులచవితి పర్వదినం సందర్భంగా శ్రీమలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి తిరుమాడ వీధులలో పెద్దశేష వాహనంపై విహరిస్తు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవ వాహనసేవలలో కూడా తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ఆ భగవంతుడు ప్రసాదించారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల నాలుగు మాడవీధులలో రాత్రి 7 నుండి 9 గంటల నడుమ శ్రీ మలయప్ప స్వామివారు తమ ఉభయదేవేరులతో కలిసి విహరిస్తూ పెద్దశేష వాహనంపై కటాక్షించనున్నారు.

బ్యాడ్మింటన్ క్రీడలో

'స్విమ్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:



శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి విద్యార్థులు ఐఐటి ఏర్పేడు తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన సన్యోగ్ – 2023 ఇన్విటేషనల్ ఇంటర్ కాలేజీయేట్ షట్లలే బాడ్మింటన్ (ఉమెన్స్) ఛాంపియన్స్‌లో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ విద్యార్థులు రన్నర్స్ ఛాంపియన్స్‌గా నిలచారని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి.కుమార్ మాట్లాడుతూ క్రీడలు, వ్యాయం అనేది మానవ జీవితంతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. మానసిక, శారీరక ఆనందానికి ఇవి ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి, ఫిజికల్ డైరెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రోమాలో దీపావళి ఆఫర్లు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : టాటా ఎంటర్‌ప్రైజ్ అయిన క్రోమా దీపావళి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ పిఆర్ఓ తెలిపారు. దీపావళి ఆకుల సందర్భంగా ఆయన విలేకరితో మాట్లాడుతూ క్రోమా స్టోర్‌లు, క్రోమా వెబ్‌సైట్ క్రోమా.కం అంతటా ఆఫర్లు లభిస్తాయి. స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మెషీన్‌లు, ఏసిలు, రిఫ్రిజిరేటర్‌లు, స్మార్ట్‌ఫోన్‌లతో పాటు అనేక ఎలక్ట్రానిక్ వస్తువులు ప్రత్యేక ఆఫర్లు లభిస్తాయి అన్నారు. ఈఆఫర్లు నవంబర్ 15తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వినియోగదారులు దీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్రీ ఇన్వర్టర్ రిఫ్రిజిరేటర్ రూ.22,990, కన్వర్టిబుల్ 256ఎల్ రిఫ్రిజిరేటర్ రూ.28,990, ఇలాగే తక్కువైన ధరలకు అనేక రకాల ఎలక్ట్రికల్ వస్తు లభ్యమవుతాయని ఈఅవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

తిరుపతిలో 'కావేరీ క్లినిక్' ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దక్షిణ భారతదేశంలోని మల్టీ–స్పెషాలిటీ ఆరోగ్య సంరక్షణ రంగంలో సుప్రసిద్ధమైన పేరు సంపాదించుకున్న చెన్నై రేడియల్ రోడ్డులోని కావేరీ హాస్పిటల్ తిరుపతిలో తమ సమాచార కేంద్రాన్ని, క్లినిక్‌ను తిరుపతిలో ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. తిరుపతి వాసులకు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఆరోగ్య సంరక్షణ అవసరాలను ఈ కేంద్రం తీరుస్తుందని, నిపుణుల ద్వారా వైద్యసంప్రదింపులు అత్యున్నత శ్రేణి ఆరోగ్యసంరక్షణ సేవలకు ఈ నూతన కేంద్రం హామీ ఇస్తోందని పేర్కొన్నారు. ఈసమాచార కేంద్రంలో న్యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, వివిధ ఇతర వైద్యవిభాగాల్లో నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు ఉంటారని, నిపుణులు వారంలో నిర్దేశించిన రోజుల్లో అందుబాటులో ఉంటారని వారు షెడ్యూల్స్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రోగులు తమ కన్సల్టేషన్ల కోసం ప్రణాళిక వేసుకోవడానికీ, సకాలంలో నైపుణ్యమైన వైద్యసంరక్షణను అందుకోవడానికీ ఈ సానుకూల దక్పథం దోహదం చేసుందన్నారు. తిరుపతిలో వైద్యులను సప్రదించడానికి 76809 38555 నంబర్‌ను పప్రదించాలని కోరారు.


ప్రజా రక్షణభేరి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం సిపిఎం నాయకులు ప్రజారక్షణ భేరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాల వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం బతకాలన్నా ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ రాజకీయాలకు వేదిక కానున్న విజయవాడ సిపిఎం ప్రజారక్షణ బహిరంగ సభకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, గురుమూర్తి పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్ కు రైన్ కోట్స్ వితరణ


కానిస్టేబుళ్లకు రైన్ కోట్సు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరు పట్టణ సీఐ హజరత్ బాబు చేతుల మీదుగా 15 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు రైన్ కోట్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ హజరత్ బాబు మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ కానిస్టేబుల్స్ కు రైన్ కోట్స్ ఇవ్వడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం దాత పొణాక మల్లికార్జున్ రెడ్డి సాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, ఏఎస్ఐ, బాబురావు, లక్ష్మీపతి, కార్యవర్గ సభ్యులు పూర్ణ, వాకాటి రామ్మోహన రావు, గ్రానైట్ ప్రభాకర్, వాచ్ షాప్ రాము, కుమార్ నాయుడు, పిల్లిల శీను, కృష్ణ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చంద్రబాబుపై బనాయించిన స్కిల్ డెవలప్‌మెంటు కేసును సుప్రీంకోర్టులో కొట్టివేయాలని కోరుతూ టిడిపి నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'నిజం తెలియాలి.. నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా పుత్తూరు మండలం టిడిపి నాయకులు మాట్లాడుతూ రేపటి రోజున సుప్రీంకోర్టులో చంద్రబాబుకు సంబంధించి 17 ఎ పై విచారించి అందులో బాబు ఏ తప్పులేదని స్కిల్ డెవలప్మెంట్ ఈ కేసుని కొట్టివేయాలని కోరుతూ పుత్తూరు మండలం నుండి మంగళవారం వివిధ ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు సుప్రీంకోర్టులో కొట్టివేస్తున్నట్లు తీర్పు వచ్చి నిజాయతీ గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డి రవికుమార్, వడమాల పేట మండలం ప్రధాన కార్యదర్శి డి హేమ వతి, ఐ టిడిపి కోఆర్డినేటర్ యం ఈశ్వర్ యాదవ్, 19వ వార్డు అధ్యక్షులు ఉమాశంకర్ రెడ్డి, తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రటరీ హమీద్ భాష, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి నాగరత్న, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజిని, పుత్తూరు టౌన్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఇ మోహన పాల్గొన్నారు.

నృత్య నీరాజనం వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : పరమేశ్వరునికి నృత్య నీరాజనం వాల్‌పోస్టర్లను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరమేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన పరమేశ్వరునికి నృత్య నీరాజనం కార్యక్రమం 'వే' ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య, సభ్యురాలు మునిలక్ష్మీ కార్యక్రమం వివరాలు గురించి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి వివరించారు. ఈ కార్యక్రమంలో 111మంది నృత్యకారులు నృత్యం చేసి పరమేశ్వరునికి నృత్య నీరాజనం చనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య తెలిపారు. వైసిపి నాయకులు మేకలత్తూరు చంద్రశేఖర్ అలియాస్ ఎస్ఎస్ చంద్ర, గుడిమల్లం దినేష్ యాదవ్ పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరులోని త్యాగరాజా వీధిలో కొలువైన కల్యాణ వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మీనుగుల రమాదేవి జ్ఞాపకార్థం భర్త అరవింద ఆసుపత్రి అధినేత వెంకట పెంచలరావు సాయంతో అన్నదానం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-నాయుడుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి ఆరు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నాయుడు పేటలోని రెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథ రామి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, 24 వ వార్డు కౌన్సిలర్ దారా రవి, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు భావన్, నాయుడు పేట పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ గందవళ్ళి సిద్దయ్య నాయకులు పాల్గొన్నారు.


జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి నాయకులు

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ప్రజాశక్తి -గూడూరు: ఒకటో పట్టణ పరిధిలోని సాధుపేట్ సెంటర్లో విద్యుత్ షాక్ గురై పాడి ఆవు మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం గా రక్షణ కంచె లేకుండా ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయడంతో గేదెలు చెట్ల పొదల్లో మేత మేసేందుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఉన్న గడ్డిని మేసేందుకు వెళ్లిన పాడి ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. స్థానికులు ఆవు మృతి చెందిన విషయాన్ని యజమానికి తెలుపగా అక్కడికి చేరుకున్న యజమాని విషాదంలో మునిగి తేలారు. సుమారు 70 వేల రూపాయల విలువ చేసే ఆవు మృతి చెందడంతో యజమాని బాధకు అంతే లేకుండా పోయింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు రక్షణ కంచె ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాల బారీ నుండి కాపాడాలని కోరుతున్నారు.

ఘనంగా రెడ్ కలర్ డే వేడుకలు

ప్రజాశక్తి-పాకాల: స్థానిక స్కై లైన్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో మంగళ వారం రెడ్ కలర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కై లైన్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ పాలకూరి నాగేంద్ర మాట్లాడుతూ స్కైలైన్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ లో రెడ్ కలర్ డే ని ఘనంగా నిర్వహించామన్నారు. రెడ్ అంటే స్ట్రెంత్, పవర్, ఎనర్జీ, డేంజర్ అని ఎరుపు అనేది ప్రైమరీ కలర్ అని రెడ్ కలర్ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించి రెడ్ కలర్ డే లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగనన్న పశు ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రారంభోత్సవంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి -ఏర్పేడు: పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఏర్పేడు మండలంలోని బండారుపల్లి గ్రామ పంచాయతీలో పశు వైద్య శిబిరాన్ని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి మంగళ వారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ నోరులేని పశువులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడే బృహత్తర కార్యక్రమం జగనన్న పశు ఆరోగ్య సురక్ష అన్నారు. ఈ కార్యక్రమం అమలు లో క్షేత్ర స్థాయి లోని అవకాశాలను అధ్యయనం చేయడానికి ఒక పైలెట్ క్యాంపును బండారుపల్లిలో నిర్వహించడం ఎంతో సంతోషం గా ఉంద‌ని రైతులు వారి పశువులకు వైద్య ఆరోగ్య శిబిరాల్లో తప్పక చికిత్స చేయించుకోవాలని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి రైతులకు సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను, వైద్య పరీక్షల ఏర్పాట్లను కలెక్టర్ , పశు సంవర్ధక శాఖ సంచాలకులు అమరేంద్ర కుమార్, అదనపు సంచాలకులు వెంకట్రావు, సత్య కుమారితో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు జిల్లాలలో ఇది పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారని అందులో భాగంగా మన జిల్లాలో ఏర్పేడు మండలం బండారుపల్లి లో పశుసంపద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వాలంటీర్లు గృహ సందర్శన చేసి రైతులు కలిగి ఉన్న పశువుల వివరాలు, పశువులకు సంబంధించిన ఆరోగ్య సమస్యల గురించి సమగ్ర సర్వే నిర్వహించి నాలుగు రకాల పరీక్షలను రైతు ఇంటి వద్దే నిర్వహించి ల్యాబ్‌లో నిర్వహించాల్సిన పరీక్షల కోసం పశువుల నుండి రక్త నమూనాల సేకరించి ల్యాబ్‌లో తగిన పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం రైతులకు ఎంతో ఉపయోగకరమని దేశ వ్యాప్తంగా ఇది చేపట్టాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రికి పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఏ చైర్మన్ సంతోష్, ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి గున్నేర్ కిషోర్ రెడ్డి, ఏర్పేడు జడ్పిటిసి తిరుమలయ్య, ఏర్పేడు మండల ప్రసిడెంట్ రమణయ్య యాదవ్, వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ బత్తి శెట్టి, సింగల్ విండో ప్రసిడెంట్ జనార్ధన్ యాదవ్, మాజీ సింగల్ విండో ప్రసిడెంట్ నాగార్జున రెడ్డి, బండారుపల్లి సర్పంచ్ జీవిత, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీలు వెంకటేశ్వర్లు, రత్నకుమారి, సహాయ సంచాలకులు నారాయణ కులశేఖర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్, మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శిల్పారెడ్డి, రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


జగనన్న పశు ఆరోగ్య సురక్ష ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి

డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాల లోని ఓపెన్ ఆడిటోరియం సమావేశ మందిరంలో అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బకాసిక్ పీస్ జాతీయ స్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో మంగళ వారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి వున్న మేధాశక్తిని ప్రదర్శించేందుకు ఈ చదరంగం పోటీలు వేదిక గా ఉన్నాయి. ప్రతి సంవత్సరం చదరంగం పోటీలు నిర్వహించే ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తారన్నారు. అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలకు డిఆర్‌డబ్ల్యు కళాశాల వేదిక కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ హనుమంతరావు పేర్కొన్నారు. చిల్డ్రన్స్‌డే ను పురస్కరించుకుని ఈ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెస్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు నరేంద్ర నాథ్ చౌదరి పర్యవేక్షణలో పట్టణంలోని 18 పాఠశాలలకు చెందిన 210 మంది విద్యార్థులు ఈ చదరంగం పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూయా, గిరిబాబు, మనోజ్ కుమార్, యోగి, చెస్ ఆర్గనైజర్ రామ్ , షేక్ అమ్మద్దీన్ , మురళి, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.


చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పవన్‌తో హరిప్రసాద్ భేటీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కులాలను కలిపే రాజకీయ విధానమే జనసేన సిద్ధాంతమని జనసేనాని పవన్ కళ్యాణ్ పునరుద్ఘాటించారు. హైదరాబాద్ లో పవన్ కళ్యాణ్ తో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. కులాలను కలిపే రాజకీయ విధానంతో, మతాల ప్రస్తావన లేని రాజకీయ సిద్ధాంతంతో జనసేన పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అక్రమ కేసులపై జనసైనికులకు అండగా ఉంటామని పవన్ హామీ ఇచ్చారన్నారు.

సంప్రదాయ వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి, జాతీయ ఔషధ మొక్కల బోర్డు మంజూరు చేసిన "ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ మెడిసినల్ గార్డెన్ ఇన్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం" ప్రాజెక్ట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 సంయుక్తంగా ఆయుర్వేద ఫర్ ఒన్ హెల్త్ అనే అంశం పై తిరుపతి రూరల్ మండలంలోని కుంట్రపాకంలో అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జోత్స్న విచ్చేసి ఆయుర్వేదం సంప్రదాయ భారతీయ వైద్య విధానమని, వ్యాధి వచ్చిన తరువాత నయం చేయడం కన్నా రోగం బారిన పడకుండా శారీరక మానసిక రోగ్యాన్ని రక్షించడమే ఆయుర్వేదం ప్రథమ లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డా. గిరిజ ప్రాజెక్ట్ కో ఇన్వెస్టిగేటర్ ప్రొ విజయకుమారి , డా.సువర్చల, డా.శాంతిశ్రీ అనేకరకాల ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు, రైతులకు, ఔషధ మొక్కలతో పాటుగా, జమా, దానిమ్మ, ఉసిరి వంటి పండ్ల మొక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శుభ పద్మనాభ రెడ్డి, బయోసైన్స్ అండ్ సెరికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివారం సెలవు ప్రకటించండి..

- మున్సిపల్ కార్మికుల అభ్యర్థన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాల్టీలో కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఆదివారం సెలవు దినం గా ప్రకటించాలని గూడూరు లేబర్ ఆఫీసర్ కి సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు లేబర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సెలవు లేకుండా సంవత్సరం రోజులూ పని చేస్తున్నారని కార్మికులు ఇబ్బందులు, అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి కోటేశ్వరరావు, మహిళ అధ్యక్షులు ప్రభావతి, కార్మికులు పాల్గొన్నారు.


లేబర్ ఆఫీసర్ కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

పేదల మంచికోసమే సంక్షేమ పథకాలు: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పేదల మంచి కోసమే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం సాయంత్రం గోవిందపాళెం సచివాలయ పరిధిలోని 11వ వార్డు సిటిజెర్ నెత్తం, వీరప్ప రెడ్డి కండ్రిక, ఎపి డబ్ల్యు, బత్తల వారి కండ్రిక, విద్యానగర్,ఆర్ డి ఎం గేట్ వీధులలో గడపగడపకు మన ప్రభుత్వంను మంత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్ డి జయ ప్రకాష్, డి శంకర్, కౌన్సిలర్ జానీ కెనడి, ఏకాంబరం, మున్సిపల్ కమిషనర్ రెడ్డి, గజేంద్ర నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వైసిపి కన్వీనర్, మండల కన్వీనర్, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సరోజమ్మకు టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: టిడిపి కుటుంబ సభ్యురాలు బీగల సరోజమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే..వెంటనే చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని మంగళవారం నూతుకుంటపల్లి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి జనార్దన్ చౌదరి, కోరా హరి ప్రసాద్, గుణసుందరి, సోము, రాయల్, బండి విజయ్ కుమార్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే విద్యార్థుల ప్రగతి బాట

ప్రజాశక్తి -రేణిగుంట: విద్యార్థులు ప్రగతి బాటలో నడవాలంటే, ఉత్తమ పౌరులు కావాలంటే శాస్త్రీయ అవగాహన పెంచుకొని శాస్త్రీయ దృక్పథంతో నడవాలని జనవిజ్ఞాన వేదిక నాయకుడు ఇమామ్ పేర్కొన్నారు. రేణిగుంటలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచారం లో భాగంగా మంగళవారం రేణిగుంట విమానాశ్రయం వద్దనున్న గిరిజన గురుకుల పాఠశాల లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు బాలాజీ, జనవిజ్ఞాన వేదిక నాయకులు కుప్పస్వామి, జనవిజ్ఞాన వేదిక జిల్లాఉపాధ్యక్షులు ఓ వెంకట రమణ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీని సందర్శించిన జాతీయ మైనారిటీ కమిషన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని జాతీయ మైనారిటీ కమిషన్ ప్రతినిధి ధ్యాన్ కుమార్ జీనప్ప, బృంద సభ్యులతో వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు వర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమై వర్సిటీలో మైనారిటీ ఉద్యోగులు, మైనారిటీ స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్ర మాన్ని నిర్వహించారు. మైనారిటీ విద్యార్థుల సమ స్యలను, ఉద్యోగుల సమస్యలను గురించి చర్చిం చారు. మైనారిటీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న స్కాలర్షిప్లు ఇతర విద్య, ఉద్యోగ సంబంధిత ప్రాయోజిత కార్యక్రమాలను గురించి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో పరిస్థితి విసి ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, అధికారులు పాల్గొన్నారు.

ఎస్విసిఈలో ఎక్స్ ప్లోరిక మెగా ఈవెంట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి– కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో మంగళవారం కళాశాల సిఎస్సి విభాగం, ఏసిఎస్ఏ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎక్స్ ప్లోరిక మెగా ఈవెంట్ 2కె23 ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఈవెంట్స్ వల్ల విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధిగా ఎదుగుదల చెందుతారని, ఇటువంటి ఈవెంట్స్ జరిగినప్పుడు విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని తమ స్కిల్స్, కెరీర్ డెవలప్మెంట్ కు తగిన శిక్షణ అందిపుచ్చుకోవాలని సూచించారు. విభాగాధిపతి శాంతి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి ఈవెంట్స్ ఉపకరిస్తాయన్నారు.

మార్కెటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, సభ్యులకు మంగళవారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్ లో ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహకులు డాక్టర్ కె .గంగాధరం ఆధ్వర్యంలో మార్కెటింగ్ పై శిక్షణ నిర్వహించారు. రైతులు పండించిన ఉత్పత్తులను వెంటనే అమ్ముకుండా ప్రాసెస్ చేసి బ్రాండ్ వేసి అమ్మడం ద్వారా మంచి ఆదాయము వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ, పట్టణాలలో మాల్స్ ఏర్పాటు చెసుకొని వినియోగదారులకు నేరుగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందించడానికి తగిన కృషి చేయాలన్నారు. ఈ మార్కెటింగ్ పెరగడానికి యువ రైతులు తగిన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. రాయచోటి నుండి వచ్చిన సిబిబివో వెంకటేశులు మాట్లాడుతూ ఎఫ్పిఓ డైరెక్టర్లు ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తూ, లోటుపాట్లను పరిశీలించి, పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విజ్ఞాన యాత్రాలు ద్వారా అవగాహన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్, జి.డి. నెల్లూరు, మన్నసముద్రం, పులిచెర్ల మండలాల ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ కంపెనీ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.



నమ్మించి మోసం చేస్తున్నాడు...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కులాలు వేరైనా ఇద్దరం ఇష్టపడి దేవుని సన్నిధిలో ఒకటయ్యామని, ప్రేమ పెళ్లితో దగ్గరైన మమ్మల్ని నా భర్త మహేంద్ర కుటుంబ సభ్యులు వేరు చేసే ప్రయత్నం చేస్తూ వేరే వివాహానికి సిద్ధపడేలా చేశారని, నమ్మించి మోసం చేస్తున్న మహేంద్రను మందలించి కాపురం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొర్లగుంటకు చెందిన దేవి పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు దేవి మాట్లాడుతూ పెద్దలను ఎదిరించి ఈ ఏడాది జూలై 17న పుత్తూరు సమీపంలోని అంజేరమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నామన్నారు. అయితే కొన్నాళ్లు సజావుగా సాగిన మా కాపురంలో అత్తింటి వారు రాజకీయ పలుకుబడిలతో నా నుండి నా భర్తను దూరం చేసి మరో వివాహం చేసుకోవడానికి సిద్ధపడేలా చేశారన్నారు. దీనిపై దిశ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారని, అయినా మహేంద్ర లో ఎటువంటి మార్పు రాకుండా ఇంటికి రాకుండా, ఫోను ద్వారా సంప్రదించాలని ప్రయత్నించిన నిరాకరిస్తున్నాడని, పోలీసు ఉన్నతాధికారులు తన భర్తను తన వద్దకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, కల్పన, రాజేశ్వరి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరు లో టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీని విస్తృతంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కన్నయ్య నాయుడు, దానయ్య, దామా మునెయ్య, రమేష్ , సుబ్బయ్య పాల్గొన్నారు.

స్కాట్ మాస్టర్ వెంకటేశ్వర్లుకు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డివిజన్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ సేవల్లో భాగంగా స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు పలుసేవ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ సేవ గ్రహీతగా అవార్డును తిరుపతి కలెక్టర్ వెంకటరమణ రెడ్డి చేతుల మీదుగా స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు. పుత్తూరు డివిజన్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను గుర్తించి స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ ఫౌండేషన్ డే సందర్భంగా అవార్డును స్వీకరించారు.

వేలూరు నరువి ఆస్పత్రిలో నూతన వార్డులు ప్రారంభం

- చైర్మన్ డాక్టర్ జివి సంపత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేలూరులోని నరువి ఆసుపత్రిలో అధునాతన వసతులతో రెండు కొత్త వార్డులను ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జీవీ సంపత్ వెల్లడించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే అత్యాధునిక సౌకర్యాలతో దాదాపు అన్ని రోగాలకు వైద్య సేవలు కలిగిన వార్డులు ఉన్నాయని, నూతనంగా బర్న్స్ వార్డు, స్ట్రోక్ వార్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదాల వల్ల గాయాల పాలైన వారికి మెరుగైన చికిత్సలు బర్న్స్ వార్డులో చికిత్సలు అందిస్తా మన్నారు. స్ట్రోక్ వార్డ్ ద్వారా గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు అత్యాధునిక వైద్య సేవలతో ఈ విభాగం సేవలు అందించ నుందన్నారు. నరువి ఆసుపత్రిలో క్యాన్సర్ బారిన పడిన వారికి ప్రత్యేక చికిత్స అందుబాటులో ఉన్నాయన్నారు. బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. హెన్రీ ఫోర్డ్ హెల్త్ సిస్టమ్స్ నుంచి నరువి ఆసుపత్రికి లైసెన్సు రావడం గొప్ప విషయ మన్నారు. కేథ్ ల్యాబ్ ద్వారా 2,500 మంది రోగులకు ఏంజియోగ్రామ్, ఎండోస్కోపీ విధానం ద్వారా 8,500 మందికి విజయవంతంగా చికిత్స లు చేశామన్నారు. 7,500 కిడ్నీ వ్యాధి గ్రస్తులు డయాలసిస్, 1,500 మంది గర్భిణీలకు సులభ తర పద్ధతుల్లో కాన్పులు చేసినట్లు వివరించారు. ఇంకా విజయవంతంగా మూడు లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశా మన్నారు. ప్రస్తుతం దేశమంతటా డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో, బ్లడ్ ప్లేట్లెట్స్ తగ్గిపోకుండా సరైన సమయంలో వైద్య సేవలు ఉండేలా ప్రజలు తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ కురియన్ థామస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకబ్ జోస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సంపత్

క్రైం న్యూస్

విద్యుత్తు షాక్‌తో వివాహిత మృతి

ప్రజాశక్తి - ఓజిలి : విద్యుత్తు షాక్‌తో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని సగుటూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన దేవుళ్ళ అంకమ్మ కుమార్తె సింధు (20) ఇంట్లో ఉన్న సింగల్ ఫేజ్ మోటర్ వైర్ కనెక్షన్ తొలగిస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగిలి నీటి గుంటలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటా హుటిన వైద్యం కోసం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి సింధు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. మృతురాలు సింధును రాపూరు మండలం అక్కమాంపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌తో 8 నెలలు క్రితం వివాహమైంది. భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో మృతురాలు సింధు వడ్డిపాలెంలోని తమ తల్లిదండ్రులు వద్దే ఉంటోంది. తల్లి దేవుళ్ల అంకమ్మ ఫిర్యాదు మేరకు ఓజిలి ఎస్ఐ దారం ఆదిలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తులు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు 15 నవంబర్2023 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యన్.విశ్వ నాథ్ రెడ్డి తెలియచేశారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని,11వ తరగతికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 10వ తరగతి లో చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పై తరగతులకు దరఖాస్తు చేసుకునేందుకు 2023 - 24 విద్యా సంవత్సరం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాల ,బాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుండి 2009 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని,పరీక్షా తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.